AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAYNEWS.COM

## జపాన్ సంస్థతో 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ' భాగస్వామ్యం



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** తెలంగాణ యువతకు అంతర్జాతీయ స్థాయి సాంకేతిక విద్య, నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలను అందించేందుకు జపాన్‌లోని ప్రముఖ సాంకేతిక విద్యాసంస్థలతో భాగస్వామ్యాలను బలోపేతం చేస్తున్నామని మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. ఇందులో భాగంగా హిరోషిమా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (హెచ్ఐటీ), యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ (వైఐఎస్‌యూ) మధ్య భాగస్వామ్యానికి సూత్రప్రాయ అంగీకారం కుదిరిందని పేర్కొన్నారు.

## ఓవర్సీస్ విద్యానిధి పథకానికి దరఖాస్తుల ఆహ్వానం




**అక్షరటుడే, హైదరబాద్ :** మహాత్మా జ్యోతిబా పూలే బీసీ ఓవర్సీస్ విద్యానిధి పథకం ద్వారా విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించాలనుకునే బీసీ, ఈబీసీ విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం మరోసారి అవకాశం కల్పిస్తోంది. 2026 ఆగస్టు/సెప్టెంబర్ ఫాల్ సెషన్ కోసం సెప్టెంబర్ 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు దరఖాస్తులు స్వీకరిస్తోంది. ఈ విడతలో మొత్తం 350 మంది విద్యార్థులను ఎంపిక చేయనుండగా, అందులో 250 మంది బీసీ విద్యార్థులు, 100 మంది ఈబీసీ విద్యార్థులు ఉంటారు.

28-8-2026 (Friday) MAIN EDITION

## మైన్స్ ఏడీ జయరాజ్‌కు రిమాండ్

**అక్షరటుడే, వరంగల్ :** భూపాలపల్లి జిల్లా మైన్స్ ఏడీ జయరాజ్ ఇళ్లలో ఏసీబీ అధికారులు సోదాలు చేసిన విషయం తెలిసిందే. శుక్రవారం ఉదయం ఏడీ జయరాజ్‌ను కోర్టులో ప్రవేశ పెట్టారు. న్యాయమూర్తి ఆయనకు 14 రోజుల రిమాండ్ విధించారు. దీంతో వరంగల్ జైలుకు నిందితుడిని తరలించారు.



## స్పెషల్‌గా రాఖీ జరుపుకున్న ఎంపీ సతీష్ బాబు

**అక్షరటుడే, ఏపీ :** రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు కాకినాడ జిల్లాకు చెందిన జెన్-జీ యువతతో కలిసి రాఖీ పండుగను వినూత్న రీతిలో జరుపుకున్నారు. కొప్పవరం కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఈ వేడుకల్లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కాలేజీ విద్యార్థినులు ఎంపీ సతీష్ బాబుకు రాఖీలు కట్టారు.



## లారీని ఢీకొన్న బస్సు

**అక్షరటుడే, ఏపీ:** ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలం చెంబడిపాలెం గ్రామం సమీపంలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. కర్ణాటక ఆర్టీసీ బస్సు, కలప దుంగలతో నిండి నిలిపి ఉంచిన లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సుమారు 16 మంది గాయపడ్డారు.



**రాఖీ పౌర్ణమి పండుగ సందర్భంగా సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులపై తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అదనపు భారం మోపుతోంది. పండుగ రద్దీని ఆసరాగా చేసుకుని స్పెషల్ బస్సుల పేరుతో సాధారణ రోజుల కంటే దాదాపు 50 శాతం మేర ఎక్స్‌ట్రా చార్జీలు వసూలు చేస్తుండటంతో ప్రయాణికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పండుగ వేళ ప్రయాణికులకు అనుగుణంగా బస్సులు నడపాల్సిన ఆర్టీసీ దోపిడీకి పాల్పడుతోందని విమర్శించారు.**

- అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిది




# పండుగ పూట ఛార్జీల మోత

- రాఖీ పండుగ వేళ ప్రయాణికులకు షాక్.. ▪ స్పెషల్ బస్సుల పేరుతో అదనపు బాదుడు ▪ అసంతృప్తి వ్యక్తం చేసిన ప్రజలు

రాఖీ పండుగ సందర్భంగా శుక్రవారం మహిళలు తమ సోదరులకు రాఖీ కట్టేందుకు వెళ్లారు. దీంతో బస్సులు, బస్టాండ్‌లు ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. ఈ క్రమంలో స్పెషల్ బస్సుల పేరిట ఆర్టీసీ అదనపు ఛార్జీలు వసూలు చేసింది. తిరుగు ప్రయాణంలో బస్సులు ఖాళీగా వస్తాయనే కారణంతో ఆర్టీసీ యాజమాన్యం '1.50' నిబంధనను అమలు చేస్తోంది. దీనివల్ల పండుగ వేళ ప్రయాణికులకు తీవ్ర ఆర్థిక భారం పడుతోంది. ఉదాహరణకు, హైదరాబాద్ నుండి కరీంనగర్‌కు సాధారణ రోజుల్లో మెట్రో డీలక్స్ లేదా రాజధాని బస్సు చార్జీ రూ.290 ఉండగా, ప్రస్తుతం స్పెషల్ బస్సుల్లో రూ.400 వరకు వసూలు చేస్తున్నారు. సూపర్ లగ్జరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లోనూ ప్రతి టికెట్‌పై రూ.100 నుండి రూ.150 వరకు అదనంగా బాదేస్తున్నారు.

### బస్సు ఎక్కాక షాక్..

టికెట్ కౌంటర్లు లేదా బస్టాండ్లలో ముందస్తుగా ఎలాంటి స్పష్టమైన సమాచారం ఇవ్వకుండా, ప్రయాణికులు బస్సు ఎక్కిన తర్వాత మార్గమధ్యంలో అదనపు చార్జీలు చెల్లించాలని కండక్టర్లు డిమాండ్ చేస్తున్నారు. దీంతో ప్రయాణికులకు, ఆర్టీసీ సిబ్బందికి మధ్య వాగ్వాదాలు జరిగాయి. ముందస్తు సమాచారం లేకుండా బస్సు ఎక్కాక ఎక్కువ డబ్బులు అడిగితే ఎలా అని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పండుగ వేళ దోపిడీ సరికాదని పలువురు పేర్కొన్నారు.

### జర్నలిస్టుల పాసులకు నిరాకరణ

స్పెషల్ బస్సుల్లో నిబంధనలు సరిగా అమలు కావడం లేదనే విమర్శలున్నాయి. స్టేట్, జిల్లా జర్నలిస్టులకు వర్తించాల్సిన 1/3 వంతు రాయితీ (కాన్సెషన్) రూల్‌ను ఈ బస్సుల్లో పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. దీనిపై ప్రశ్నిస్తే కండక్టర్లు దురుసుగా ప్రవర్తిస్తున్నారని సమాచారం. మహిళలకు 'మహాలక్ష్మి' పథకం ద్వారా సాధారణ బస్సుల్లో ఉచిత ప్రయాణం ఉండటంతో ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సులు కిక్కిరిసిపోతున్నాయి. కుటుంబాలతో వెళ్లే పురుషులు, సాధారణ ప్రయాణికులకు సీట్లు దొరకని పరిస్థితి ఏర్పడింది. వేరే దారి లేక స్పెషల్ బస్సులను ఆశ్రయిస్తున్న ప్రయాణికులపై ఆర్టీసీ ఈ విధంగా అదనపు చార్జీల మోత మోగిస్తోందని సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## సీఎం రేవంత్‌రెడ్డికి రాఖీ కట్టిన మంత్రి కొండా సురేఖ



**అక్షరటుడే, హైదరాబాద్ :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంత్రి కొండా సురేఖ రాఖీ కట్టారు. రాఖీ పండుగను పురస్కరించుకొని ఆయన నివాసానికి వెళ్లిన ఆమె రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. పరకాల వివాదం తర్వాత కొండా సురేఖపై పలువురు కాంగ్రెస్ నాయకులు ఆగ్రహంతో ఉన్న విషయం తెలిసిందే. ఆమె కూతురు సుష్మిత సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపణలు చేశారు. ఈ క్రమంలో సురేఖపై చర్యలు తీసుకోవడానికి పార్టీ సిద్ధం అవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ తరుణంలో మంత్రి సురేఖ సీఎం నివాసానికి వెళ్లడం ప్రాధాన్యత సంతరించుకుంది. మంత్రి సీతక్క, కొండా సురేఖ సీఎంకు రాఖీ కట్టారు. అనంతరం సురేఖ మీడియాతో మాట్లాడకుండానే వెళ్లిపోయారు.


## సింగరేణి కార్మికులను మోసం చేసిన కాంగ్రెస్



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** మొక్కుబడిగా మెడికల్ బోర్డును నిర్వహిస్తూ మరోసారి సింగరేణి కార్మికులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. 120 మంది కార్మికులను మెడికల్ బోర్డుకు పిలిచి కేవలం 12 మందినే అన్ ఫిట్‌గా ప్రకటించడం అన్యాయం అన్నారు. సింగరేణి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. వారి కుటుంబాలకు భరోసా కల్పించాలన్న చిత్తశుద్ధి ఈ ప్రభుత్వానికి లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా మెడికల్ అన్ ఫిట్ కోసం దరఖాస్తు పెట్టుకున్న ప్రతి కార్మికుడిని అన్ ఫిట్‌గా ప్రకటించి వారి వారసులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.


## చైనాలో భూకంపం.. నేపాల్‌కు వరద హెచ్చరికలు

**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** చైనాలో భూకంపం చోటు చేసుకుంది. శుక్రవారం నాడు నైరుతి చైనాలోని సియాచిన్ ప్రావిన్స్‌లో 5.1 తీవ్రతతో భూకంపం సంభవించింది. స్థానిక కాలమానం ప్రకారం శుక్రవారం మధ్యాహ్నం 1:13 గంటలకు ప్రావిన్స్‌ను తాకింది. భూకంపం 13 కిలోమీటర్ల లోతులో సంభవించిందని అధికారులు తెలిపారు. దీని ప్రభావంతో నేపాల్‌కు మరోసారి భారీ వరదలు వచ్చే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. ఈ మేరకు రెడ్ అలర్ట్ ప్రకటించారు. ఐదు రెట్ల అధిక తీవ్రతతో నేపాల్‌కు వరదలు వస్తాయని, ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.



## జిమ్ ట్రైనర్ హత్య కేసులో విచారణ

**అక్షరటుడే, ఏపీ:** కాకినాడ జిమ్ ట్రైనర్ సతీష్ కేసులో విచారణ కొనసాగుతోంది. హత్య కేసును తప్పుదారి పట్టించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారని సతీష్ భార్య జయశ్రీ ఆరోపించారు. తన ప్రియురాలితో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని సతీష్‌ను స్నేహితుడు హత్య చేసిన విషయం తెలిసిందే. తన భర్త హత్య కేసు వెనుక ఎవరెవరున్నారో దర్యాప్తు చేయాలని జయశ్రీ డిమాండ్ చేశారు. నిందితుడు సాయి కిరణ్‌ను సొంత తమ్ముడిలా చూసుకున్నామని చెప్పారు. అన్నం పెట్టిన వ్యక్తిని కిరాతకంగా చంపారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసును పోలీసులు తప్పుదారి పట్టిస్తున్నారని ఆమె ఆరోపించారు.







## ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక

**అక్షరటుడే, నాంపల్లి:** హైదరాబాద్‌లో ప్రభుత్వం ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఇళ్ల కోసం పేదల నుంచి ఇప్పటికే దరఖాస్తులు స్వీకరించింది. శుక్రవారం లక్కీ డ్రా ద్వారా పలు నియోజకవర్గాల్లో లబ్ధిదారులను ఎంపిక చేశారు. నాంపల్లి, రాజేంద్రనగర్ నియోజకవర్గాల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమక్షంలో లాటరీ పద్ధతి ద్వారా పారదర్శకంగా ఇందిరమ్మ టవర్స్ లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను నిర్వహించారు. నగరంలోనే, ప్రజలు నివసించే ప్రాంతాల్లోనే, కోట్లాది రూపాయల విలువైన భూముల్లో ప్రజలు సగర్వంగా, సంతోషంగా నివసించేలా ఇందిరమ్మ టవర్స్ నిర్మిస్తామని పొంగులేటి తెలిపారు.

## ఢిల్లీలో మోడల్ హత్య.. నిందితుడి అరెస్ట్

**అక్షరటుడే, ఢిల్లీ :** ఢిల్లీకి చెందిన 21 ఏళ్ల మోడల్‌ను కత్తితో పొడిచి హత్య చేసిన జిమ్ ట్రైనర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. గురువారం రాత్రి జరిగిన ఎదురుకాల్పుల (ఎన్‌కౌంటర్) తర్వాత నిందితుడు ఇమ్రాన్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. ఢిల్లీలోని రాజౌరీ గార్డెన్ ప్రాంతంలో పోలీసులతో జరిగిన కాల్పుల సమయంలో ఇమ్రాన్ రెండు కాళ్ళలోనూ బుల్లెట్ గాయాలయ్యాయి. గాయాల కారణంగా అతన్ని ఆసుపత్రిలో చేర్చారు. మరొక వ్యక్తితో మాట్లాడటంపై ఆగ్రహంతో ఉన్న ఇమ్రాన్ మోడల్ ముస్కాన్‌ను కత్తితో పొడిచి చంపాడు.






## కాంగ్రెస్ వైఫల్యాలపై బీఆర్ఎస్ పోరుబాట

**అక్షరటుడే, హైదరాబాద్ :** కాంగ్రెస్ వెయ్యి రోజుల వైఫల్యాలపై పోరుబాట చేపట్టాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 2 నుంచి వారం రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీల మోసంతో పాటు పాలన వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు కేటీఆర్ సూచించారు. వెయ్యి రోజులైనా నెరవేరని హామీలపై ప్రజలను చైతన్యవంతం చేయడమే కాకుండా.. కాంగ్రెస్ హామీల వైఫల్యం, అవినీతిని ఎండగట్టాలన్నారు. వారం రోజుల ప్రత్యేక నిరసన కార్యక్రమాలపై పార్టీ శ్రేణులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.

## అమెరికాలో తెలుగు యువతి హత్య కేసులో కీలక పరిణామం

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అమెరికాలో తెలుగు యువతి నిఖిత హత్య కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఆమె మాజీ ప్రియుడు అర్జున్ శర్మ(27)ను ఆగ్రాలో తెలంగాణ పోలీసులు అరెస్ట్ చేశారు. అమెరికాలో నిఖిత హత్య అనంతరం అర్జున్ శర్మ భారత్‌కు వచ్చారు. హైదరాబాద్ లాలాగూడ పీఎస్‌లో అర్జున్ శర్మపై కేసు నమోదు అయింది. ఈ మేరకు పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి ఢిల్లీ పటియాలా హౌస్ కోర్టులో హాజరు పరిచారు.

